

తలసేమియా చంపేస్తోంది...!
తలసేమియా ఓ ప్రాణాంతక వ్యాధి. అధికారిక లెక్కల ప్రకారం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 4 వేలకు పైగా తలసేమియా బాధితులు ఉన్నారు. నేడు ప్రపంచ తలసేమియా దినోత్సవం సందర్భంగా 'సాక్షి' ప్రత్యేక కథనం...

8లో▸



హరితహారానికి సర్వం సిద్ధం
కుంటాల మండలంలోని 15 నర్సరీల్లో వేసవికి ముందే పూలు, పండ్ల మొక్కలతో పాటు ఇతరత్రా మొక్కలు పెంచుతున్నారు. ఒక్కో నర్సరీకి 11 వేల చొప్పున లక్షా 65 వేల మొక్కలు పెంచుతున్నారు.

9లో▸

వాతావరణం
గరిష్టం/కనిష్టం
38.9 /27.8

ఆకాశంలో కొంతమేరకు మేఘాలు ఉంటాయి. ఉష్ణోగ్రతలు పెరుగుతాయి. మధ్యాహ్నం వేడి, ఉక్కపోత ఎక్కువగా ఉంటుంది. సాయంత్రం చినుకులు పడే అవకాశం ఉంది.

గిట్టుబాటుకాని ఉపాధి


ఉపాధి హామీ పనులు నిర్వహిస్తున్న కూలీలు (ఫైల్)

- కష్టపడ్డా ఉపాధి హామీ కూలీలకు దక్కని ఫలితం
- గరిష్టంగా రోజు కూలి రూ.272
- గిట్టుబాటు అయ్యేది మాత్రం రూ.200 లోపే
- పనికి వెళ్లేందుకు ఆసక్తి చూపని కూలీలు

నిర్మల్‌చైన్‌గేట్: గ్రామీణ ప్రాంతాల్లో వలసలు నివారించేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఉపాధి హామీ పథకం కూలీలకు శ్రమకు తగిన ఫలితం దక్కడం లేదు. మండుటెండలో కష్టపడుతున్నా కనీస వేతనంలో సగం కూడా చేతికి రావడం లేదు. పైగా గతంలో ఇచ్చిన వేసవి అలవెన్సు కూడా నిలిపేశారు. అలవెన్సు కింద రోజు వేతనానికి అదనంగా రూ.40 వరకు చెల్లించేవారు. ప్రస్తుతం అదికూడా ఇవ్వడం లేదని కూలీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పనిచేసే చోట సౌకర్యాలు సైతం కల్పించకపోవడంతో పలు గ్రామాల్లో ఉపాధి హామీ పనులకు వెళ్లేందుకు కూలీలు ఆసక్తి చూపడంలేదు.

రూ.200 దాటని కూలి

జిల్లా వ్యాప్తంగా 1,70,780 ఉపాధిహామీ జాబ్ కార్డులు ఉండగా 3.30 లక్షల మంది కూలీలు ఉన్నారు. వారం రోజులుగా రోజుకు 78 వేల నుంచి 84 వేల మంది ఉపాధి పనులకు వెళ్తున్నారు. ప్రభుత్వం నిర్ణయించిన గరిష్ట కూలి రూ. 272 కాగా ప్రస్తుతం రూ.200 లోపు మాత్రమే గిట్టుబాటు అవుతుంది. గతంలో ఫిబ్రవరి నుంచి జూన్ వరకు అంటే వేసవిలో నాలుగు నెలల పాటు కూలీలకు 20 నుంచి 30 శాతం వరకు (వేసవిభత్యం) అదనంగా చెల్లించేవారు. గతేడాది వేసవి నుంచి అదికూడా తొలగించడంతో ప్రస్తుతం రూ.200 లోపు మాత్రమే గిట్టుబాటు అవుతోంది. దీంతో మండుటెండలో పనిచేస్తున్నా వేతనం గిట్టుబాటు కాకపోవడంతో ఉపాధి పనికి వెళ్లేందుకు కూలీలు ముందుకురావడం లేదు.

గతేడాది నుంచి కేంద్రం పరిధిలో...

ఉపాధి హామీ పథకం కేంద్ర ప్రభుత్వ పరిధిలోనిదే అయినప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం సైతం కొంత వాటా చెల్లించేది. అయితే 2022 నుంచి ఈ పథకం కేంద్రం పరిధిలో మాత్రమే కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో గతేడాది నుంచి కేంద్రం వేసవిభత్యం తొలగించి దినసరి వేతనం రూ.272 గా నిర్ణయించింది. ప్రస్తుతం జిల్లా వ్యాప్తంగా ఉపాధి హామీ కూలీలకు రూ.200 లోపు మాత్రమే గిట్టుబాటు అవుతోంది.

వేసవి భత్యం లేక..

వేసవిని పరిగణలోకి తీసుకుని శ్రమకు తగ్గ వేతనం అందించేందుకు వేసవిభత్యం అమల్లోకి తెచ్చారు. గతంలో ప్రభుత్వం వేసవి భత్యాన్ని ఫిబ్రవరి నుంచి జూన్ వరకు నిర్దేశిత మొత్తంలో వర్తింపజేసేవారు. ఫిబ్రవరిలో 20 శాతంతో ప్రారంభమై మార్చిలో 25, ఏప్రిల్‌లో 30, మేలో 30, జూన్‌లో 20 శాతం వేసవి భత్యాన్ని చెల్లించేవారు. ప్రస్తుతం అందిస్తున్న కూలీకి అదనంగా ఈ భత్యం ఉండేది. గతంలో ఈ వేసవి భత్యం ఇవ్వడంతో రోజువారి కూలీ రూ.200 నుంచి రూ.250 వరకు గిట్టుబాటు అయ్యేది.

జిల్లా వివరాలు

మండలాలు	18
గ్రామ పంచాయతీలు	396
గ్రామాలు	428
జాబ్ కార్డులు	1,70,780
యాక్టీవ్ కార్డులు	1,26,876
కూలీల సంఖ్య	3.30 లక్షలు

తగ్గుతున్న కూలీల సంఖ్య

కేంద్ర ప్రభుత్వం జాతీయ మొబైల్ పర్యవేక్షక వ్యవస్థ (ఎన్‌ఎంఎంఎస్) కింద రోజువారీగా కూలీల వివరాలు నమోదు చేయాలని నిర్దేశించింది. మరోవైపు కూలి డబ్బుల చెల్లింపు కోసం జాబ్‌కార్డు, ఆధార్, బ్యాంకు ఖాతాలను అనుసంధానం చేయాలనే నిబంధన తీసుకువచ్చారు. చాలా మంది ఆధార్ కార్డుల్లో తప్పులు దొర్లడం, బ్యాంకు ఖాతాలు లేకపోవడం వంటి కారణాలతో కూలి చెల్లింపులో జాప్యం జరుగుతోంది. ఈ సమస్యతో పాటు కూలి గిట్టబాటు కాకపోవడం కూడా కూలీల సంఖ్య తగ్గడానికి ప్రధాన కారణమని పలువురు చర్చించుకుంటున్నారు.

గిట్టుబాటు అయితలేదు



ఉపాధి పనులకు వెళ్తే రూ.200కు మించి కూలి రావడం లేదు. కూలి రేటు రూ.272కు పెంచినట్లు అధికారులు చెబుతున్నా ఇక్కడ మాత్రం అమలు చేయడం లేదు.

– రవి, ఉపాధి కూలీ

అలవెన్సు చెల్లించాలి



ఉపాధి హామీ పథకంలో గతంలో మాదిరి చేసిన పనికి కూలితో పాటు అలవెన్సులు చెల్లించాలి. అదే విధంగా పెరిగిన కూలి రేటు ఆధారంగా వేతనాలు చెల్లించాలి.

– మానస, ఉపాధి కూలీ

మెజర్మెంట్ ప్రకారం కూలి



కూలీలు పనిచేసిన దానిని బట్టి కూలి గిట్టుబాటు అవుతుంది. పని ఎక్కువగా చేస్తే కూలి ఎక్కువగానే వస్తుంది. ప్రతీ కుటుంబానికి వంద రోజుల పాటు పనికల్పిస్తాం. కూలికి తగ్గ పనికల్పించి ఎక్కువ పనిచేసేలా కూలీలకు అవగాహన కల్పిస్తున్నాం.

– వర్ధినేని సాయిచరణ్, టెక్నికల్ అసిస్టెంట్

న్యూస్‌రీల్

రైతులకు ఇబ్బంది లేకుండా చూస్తాం
- అదనపు కలెక్టర్ రాంబాబు


రైతులతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్

లోకేశ్వరం(ముధోల్): వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఇబ్బందులు లేకుండా చూస్తామని అదనపు కలెక్టర్ రాంబాబు అన్నారు. ఆదివారం మండలంలోని పిప్రినగర్, గడ్‌చాంద గ్రామాల్లోని కొనుగోలు కేంద్రాలను సందర్శించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గన్నీ బ్యాగులు, ధాన్యం తరలించేందుకు లారీల కొరత లేకుండా చూస్తామన్నారు. కొనుగోలు చేసిన ధాన్యానికి వారం రోజుల్లో రైతుల ఖాతాల్లో డబ్బులు జమ చేస్తామన్నారు. తేమ శాతం రాగానే ధాన్యం తూకం వేసి అలాట్ అయిన రైస్‌మిల్లులకు పంపించాలన్నారు. ఆయన వెంట డీఎస్‌వో తనూజ, డీఎం శ్రీకళ, తదితరులు ఉన్నారు.

సమ్మర్ క్యాంపులు సద్వినియోగం చేసుకోవాలి


విద్యార్థులతో మాట్లాడుతున్న రమణారావు

ఖానాపూర్: వేసవికాలంలో విద్యార్థులకు కాలక్షేపంతో పాటు శారీరక, మానసిక ఆరోగ్యాన్ని అందించేందుకు నిర్వహిస్తున్న సమ్మర్ క్యాంపులు సద్వినియోగం చేసుకోవాలని స్పోర్ట్స్ అండ్ గేమ్స్ జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ రమణారావు అన్నారు. ఆదివారం పట్టణంలోని పలు కేంద్రాల్లో నిర్వహిస్తున్న సమ్మర్‌క్యాంపులను పరిశీలించారు. ఈ సందర్భంగా కేంద్రాల నిర్వహణ, విద్యార్థులు, సిబ్బంది హాజరు, తదితర వివరాలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో పెటా సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బుక్యా రమేశ్, భోజన్న, మండల ఇన్‌చార్జి రవీందర్‌గౌడ్, కేంద్రం ఇన్‌చార్జి క్రాంతి, పీఈటీలు, వలంటీర్లు ఇమ్రాన్, అజీం, ఆరీఫ్ పాల్గొన్నారు.

ఆదివాసీ గ్రామాల అభివృద్ధికి కృషి


మాట్లాడుతున్న జాన్సన్‌నాయక్

ఖానాపూర్: మారుమూల ప్రాంతాల్లోని ఆదివాసీ గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తానని బీఆర్ఎస్ నియోజకవర్గ నాయకుడు బుక్యా జాన్సన్ నాయక్ అన్నారు. ఆదివారం మండలంలోని అడవి సారంగాపూర్, జిల్లేడుకుంట, రాజులమడుగు గ్రామాల్లో పర్యటించి ఆదివాసీలు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సీఎం కేసీఆర్ హయాంలోనే గ్రామాలు అభివృద్ధి చెందుతున్నాయని, పార్టీలకు అతీతంగా ప్రభుత్వం అన్ని వర్గాలకు సంక్షేమఫలాలు అందేలా చర్యలు తీసుకుంటోందన్నారు. భవిష్యత్‌లో గిరిజన గ్రామాల్లో పూర్తి స్థాయిలో అటవీ అనుమతులు తీసుకువచ్చి అభివృద్ధికి బాటలు వేస్తామన్నారు. ఆయన వెంట నాయకులు పాల సంతోష్, కొట మహేందర్, కరిపె రాజశేఖర్, బండి బుచ్చాగౌడ్, తుప్ప నరేందర్, ఎర్రన్న, ఆయా గ్రామాల ఆదివాసీలు ఉన్నారు.

నేడు భైంసాకు కేంద్ర మంత్రి రాక


భైంసాలో సమావేశమైన బీజేపీ నాయకులు

భైంసా(ముధోల్): కేంద్ర మత్స్య, పశుసంవర్ధక, పాడిపరిశ్రమ శాఖ మంత్రి పురుషోత్తం రూపాల సోమవారం భైంసా పట్టణానికి రానున్నట్లు బీజేపీ ముధోల్ అసెంబ్లీ కన్వీనర్ తాడేవార్ సాయినాథ్ తెలిపారు. ఆదివారం భైంసాలో బీజేపీ జిల్లా అధ్యక్షురాలు రమాదేవి, నాయకులు రామారావు పటేల్‌తో పాటు పలువురు నాయకులు సమావేశమై కార్యక్రమ నిర్వహణపై చర్చించారు. భైంసాలోని భోకర్ చెక్‌పోస్టు నుంచి ఎస్ఎస్ ఫంక్షన్‌హాల్ వరకు బైక్‌ర్యాలీ నిర్వహించనున్నట్లు తెలిపారు.

ఖానాపూర్: పట్టణంలోని ఏఎంకే ఫంక్షన్‌హాలులో నిర్వహించతలపెట్టిన కేంద్ర మంత్రి పురుషోత్తం రూపాల సభను విజయవంతం చేయాలని మాజీ ఎంపీ రాథోడ్ రమేశ్, బీజేపీ ఆదిలాబాద్ పార్లమెంట్ కన్వీనర్ అయ్యన్నగారి భూమన్న కోరారు. ఆదివారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. సమావేశంలో సామ రాజేశ్వర్‌రెడ్డి, నర్సాగౌడ్, ఆకుల శ్రీనివాస్, బుక్య గోవింద్, నాయిని సంతోష్, టేకు ప్రకాశ్, సదాశివ్, కిష్టయ్య, రాము, సుధాకర్, స్వామి, రవీందర్‌రెడ్డి, మహేందర్, ఆనంద్, శివ, గోపాల్‌రెడ్డి, రవీందర్‌గౌడ్, సత్తయ్య, లక్ష్మణ్, రాజేశ్వర్, తదితరులు పాల్గొన్నారు.

దళారులను నమ్మి రైతులు మోసపోవద్దు


కొనుగోలు కేంద్రం ప్రారంభిస్తున్న రేఖానాయక్

దస్తురాబాద్(ఖానాపూర్): దళారులను నమ్మి రైతులు మోసపోవద్దని ఎమ్మెల్యే రేఖానాయక్ సూచించారు. ఆదివారం మండల కేంద్రంతో పాటు మండలంలోని మున్యాలతండాలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులు పండించిన ప్రతీగింజను ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందన్నారు. కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ సింగరి కిషన్, ఆ యా గ్రామాల సర్పంచులు సురేష్ నాయక్, రాజమణి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ఐలయ్యయాదవ్, నాయకులు శ్రీనివాస్, రాజనర్సయ్య, రాజలింగం, రాజు, గంగన్న, గోపి, సత్యం పాల్గొన్నారు.

రేపు విపశ్యన ధ్యానంపై అవగాహన సదస్సు

ఖానాపూర్: పట్టణంలోని ప్రభుత్వ గిరిజన బాలుర ఆశ్రమ పాఠశాలలో మంగళవారం విపశ్యన ధ్యానంపై అవగాహన సదస్సు ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు సాయిప్రసాద్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాగద్వేషాలను తొలగించి మనస్సును నిర్మల పరిచే విపశ్యన ధ్యానం ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. వ్యక్తి–సమాజాల ప్రగతికోసం సృజనాత్మక శక్తిని ధ్యానం పెంపొందిస్తుందన్నారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు నిర్వహించనున్న సదస్సుకు ఆసక్తి గలవారు హాజరై కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు 8499985115 నంబరులో సంప్రదించాలని వారు సూచించారు.

బస్టాండ్ స్థల పరిశీలన

నిర్మల్‌టౌన్: నిర్మల్ ఆర్టీసీ బస్టాండ్‌కు చెందిన కమర్షియల్ స్థలాన్ని ఆర్టీసీ మార్కెటింగ్ కమర్షియల్ అధికారి విజయ్ కుమార్ ఆదివారం పరిశీలించారు. బస్టాండ్‌లోని ఖాళీ స్థలాన్ని వ్యాపారస్తులకు ఇవ్వడానికి పరిశీలించినట్లు తెలిపారు. ఆయన వెంట డిపో మేనేజర్ ఎస్.సాయన్న, అసిస్టెంట్ మేనేజర్ రాజశేఖర్, స్టేషన్ మేనేజర్ నారాయణ ఉన్నారు.

ఎస్‌హెచ్‌జీ సమాచారం @ లోకోస్


సమావేశంలో పాల్గొన్న స్వయం సహాయక సంఘ సభ్యులు (ఫైల్)

- అందుబాటులోకి కేంద్రం కొత్త యాప్
- వివరాల నమోదుకు యంత్రాంగం కసరత్తు
- ఈ నెల 10 నుంచి అమలుకు యోచన
- వీవోఏలపై తగ్గనున్న పనిభారం

కైలాస్‌నగర్/నిర్మల్‌చైన్‌గేట్: స్వయం సహాయక సంఘాల్లో సాంకేతికతతో పాటు పారదర్శకత పెంపొందించేలా కేంద్ర ప్రభుత్వం కొత్తగా లోకోస్ యాప్‌ను ప్రవేశపెట్టింది. పొదుపు సంఘాలకు సంబంధించిన సమగ్ర స మాచారాన్ని ఇందులో నిక్షిప్తం చేయాలని ఆదేశించింది. ఈనెల 1నుంచి పూర్తిస్థాయిలో వినియోగించాలని ఉత్తర్వులు జారీ చేసింది. అయితే వీవోఏలు సమ్మెబాట పట్టడంతో సమాచార నిక్షిప్తంలో జాప్యం అవుతోంది. ఎలాగోలా ఈ నెల 10వ తేదీ నుంచి దీ న్ని అమల్లోకి తెచ్చేలా డీఆర్డీఏ యంత్రాంగం కసర త్తు చేస్తోంది. ఈ యాప్ అమలు ద్వారా వీవోఏలపై పనిభారం తగ్గనుంది. జాతీయ గ్రామీణ జీవనోపాధుల మిషన్ ద్వారా మహిళల అభ్యున్నతికి కేంద్రమిచ్చే నిధులన్నీ యాప్ ద్వారా వచ్చే అవకాశముందనే అభిప్రాయం వ్యక్తమవుతుంది.

ఉద్దేశమేంటంటే..

కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను నేరుగా లబ్ధిదారులకు అందించాలని భావిస్తోంది. గ్రామ పంచాయతీలకు 15వ ఆర్థిక సంఘం నిధులు, ఉపాధి కూలీల వేతనాలు, రైతులకిచ్చే కిసాన్ సమ్మాన్ నిధిని ఏ విధంగా నేరుగా వారి ఖాతాల్లో జమ చేస్తుందో మహిళల అభ్యున్నతికి ఇచ్చే రుణాలను సైతం అలాగే అందించేందుకు నిర్ణయించినట్లుగా తెలుస్తోంది.

సమస్త సమాచారం..

పొదుపు సంఘాలకు సంబంధించిన సమగ్ర సమాచారాన్ని ఈ యాప్‌లో నిక్షిప్తం చేయాలని కేంద్ర ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఈ నెల 1నుంచి పూర్తి స్థాయిలో వినియోగంలోకి తీసుకురా వాలని ఆదేశించింది. ఇందులో భాగంగా డీఆర్డీఏ ఏపీడీలు, డీపీఎంలు, ఐబీ ఏపీఎంలు, కమ్యూనిటీ బేస్ ఆర్గనైజర్ ఆడిటర్లు (సీబీఓ)లకు రాష్ట్రస్థాయిలో శిక్షణ ఇచ్చారు. వీరు జిల్లా స్థాయిలో సీసీలు, ఏపీఎంలు, డీపీఎంలకు శిక్షణ ఇచ్చారు. వీరు క్షేత్రస్థాయిలో వీవోఏలు, బుక్ కీపర్లకు శిక్షణ ఇవ్వాల్సి ఉంది. అ యితే వీవోఏలు సమ్మెలో ఉండటంతో ఇంకా ఈ ప్రక్రియ పూర్తికాలేదు. ఈ శిక్షణ పూర్తయ్యాక సంఘాలకు సంబంధించిన సమగ్ర సమాచారం (ప్రొఫైల్)ను యాప్‌లో నిక్షిప్తం చేయాల్సి ఉంటుంది. వీవోల సమ్మె కారణంగా ఇందులో తీవ్ర జాప్యం జరుగుతుంది. అయితే ఎలాగైనా మే 10లోపు యాప్‌ను అమల్లోకి తేస్తామని డీఆర్డీఏ అధికారులు చెబుతున్నారు.

వీవోఏలపై తగ్గనున్న పనిభారం

మహిళా సంఘాల పనితీరు, ఆర్థిక కార్యకలాపాలు, సమావేశాల నిర్వహణ వంటి సమాచారాన్ని ఇప్పటి వరకు వీవోఏలు సెర్ప్, కేంద్రానికి సంబంధించిన వేర్వేరు యాప్‌ల్లో నమోదు చేస్తున్నారు. ఒకే సమాచారాన్ని రెండు, మూడు యాప్‌ల్లో నమోదు చేయాల్సి రావడంతో వీవోఏలపై పనిభారం పెరుగుతోంది. సమయం కూడా వృథా అవుతోంది. ఇందుకు ఆస్కారం లేకుండా ఇకపై సంఘాలకు సంబంధించిన అన్ని వివరాలు ఈ యాప్‌లో నమోదు చేయాలని కేంద్రం ఆదేశించడంతో వీవోఏలు ఎదుర్కొంటున్న ఇబ్బందులన్నీ తొలగిపోనున్నాయి.

వివరాలు నమోదు చేస్తున్నాం

సంఘాల్లోని సభ్యురాలి పేరు, భర్త పేరు, కులం, వృత్తి, వారి ఆధార్ నంబర్, ఫొటో, బ్యాంక్ అకౌంట్ ఎస్‌బీ/లోన్ వంటి ప్రాథమిక సమాచారంతో కూడిన సంఘాల ప్రొఫైల్‌తో కూడిన సమాచారాన్ని లోకోస్ యాప్‌లో నమోదు చేస్తున్నాం. వీవోఏల సమ్మెతో కొంత ఇబ్బంది ఎదురైనా ఈ నెల 10నుంచి ఈ యాప్‌ను అమల్లోకి తీసుకువచ్చేలా ప్రయత్నిస్తున్నాం. ఆ దిశగా కసరత్తు చేస్తున్నాం.

– హేమలత, డీపీఎం ఐబీ, డీఆర్డీఏ, ఆదిలాబాద్

ఉమ్మడి జిల్లాలోని గ్రామ సమాఖ్యలు, సభ్యులు, సంఘాల సమాచారం

	ఆదిలాబాద్	మంచిర్యాల	కుమురంభీం	నిర్మల్
మొత్తం గ్రామ సమాఖ్య సంఘాలు	557	468	398	504
గ్రామ స్వయం సహాయక సంఘాలు	10,738	10,158	7,953	11,983
స్వయం సహాయక సంఘాల్లోని సభ్యులు	1,15,608	1,12,448	87,947	1,34,002

'కారు'లో ఓవర్‌లోడ్..

- ఖానాపూర్‌లో కిరికిరి ..
- బరిలో దిగేందుకు ఐదుగురు
- నాకంటే నాకే సీటంటూ..
- లోకల్–నాన్‌లోకల్ లొల్లి
- ఎస్టీ నియోజకవర్గంలో పోటాపోటీ



నిర్మల్: ఓ దిక్కు దట్టమైన అడవులు, ఎత్తయిన గుట్టలు, మరో దిక్కు గోదారి పరవళ్లు, కడెం, కవ్వాల్ అందాలు.. ఎన్ని చీకట్లున్నా వీటన్నింటి మధ్యే బతుకుతున్న అడవిబిడ్డలు.. ఇలా స్వచ్ఛమైన పచ్చని ప్రకృతి అందాలతో పెనవేసుకున్నట్లుంటుంది ఖానాపూర్ నియోజకవర్గం. రాష్ట్రంలో స్వల్పంగా ఉన్న ఎస్టీ రిజర్వ్‌డ్ నియోజకవర్గాల్లో ఇదొకటి. అందుకే ఇక్కడ నేతల మధ్య పోటాపోటీ. మరో ఆరేడు నెలల్లో ఎన్నికలు రానుండటంతో రోజురోజుకూ ఖానాపూర్‌లో పొలిటికల్ హీట్ పెరుగుతోంది. ప్రధానంగా అధికార బీఆర్ఎస్ 'కారు' ఓవర్ లోడ్ అవుతోంది. ప్రస్తుతం అధికారపార్టీ ఎమ్మెల్యేనే ఉన్నా.. ఆమెకు ఈసారి టికెట్ రాదంటూ అదే పార్టీ నుంచి మరో నలుగురు ఇక్కడ సీటు ఆశిస్తున్నారు. ఎవరికి వారు ఈసారి తామే బీఆర్ఎస్ అభ్యర్థి అంటూ ప్రజల్లోకి వెళ్తున్నారు. 'నేను లోకల్– నువ్వు నాన్‌లోకల్..' అంటూ సవాల్ విసురుకుంటున్నారు. ఈ నియోజకవర్గంలో ప్రతిపక్షం కంటే స్వపక్షంలో ఉన్నవాళ్లే ఒకరిపై ఒకరు కౌంటర్లు వేసుకుంటున్నారు.

ఎస్టీ రిజర్వ్‌డ్ కావడంతో..

అటవీ ప్రాంతం ఎక్కువగా ఉన్న ఈ నియోజకవర్గంలో మొత్తం 2,05,751 మంది ఓటర్లు ఉండగా ఇందులో అధికశాతం గిరిజనులే. మండలాల వారీగా ఆదివాసీ, లంబాడాల ప్రాబల్యం ఉంటుంది. ఎన్నికల్లో నేతల గెలుపోటములను నిర్ణయించేది వీరే. రాష్ట్రంలో కేవలం తొమ్మిది ఎస్టీ రిజర్వ్‌డ్ నియోజకవర్గాలు ఉండగా ఉమ్మడి ఆదిలాబాద్‌లో ఖానాపూర్‌తో పాటు ఆసిఫాబాద్, బోథ్ ఉన్నాయి. ఇందులో ఖానాపూర్ ప్రత్యేకం. ఈ నియోజకవర్గం మూడు జిల్లాలతో ముడిపడి ఉంది. ఖానాపూర్, కడెం, దస్తురాబాద్, పెంబి మండలాలు నిర్మల్‌లో, ఉట్నూర్, ఇంద్రవెల్లి, సిరికొండ మండలాలు ఆదిలాబాద్‌లో, జన్నారం మంచిర్యాల జిల్లాలో ఉన్నాయి.

నాన్ లోకలే..

ఖానాపూర్ నియోజకవర్గంలో ప్రతీ ఎన్నికల సమయంలో ఎక్కువగా చర్చలకు వచ్చే విషయం లోకల్–నాన్‌లోకల్ గురించే. ఇక్కడ స్థానిక నేతలతో పాటు ఇతర జిల్లాలకు చెందిన వాళ్లూ వచ్చి పోటీ చేయడం ప్రత్యేకం. తాజాగా ఇదే అంశం స్థానికులైన నాయకులు లేవనెత్తుతున్నారు. ఇక్కడి ప్రజలకు నిస్వార్థంగా సేవచేసేది స్థానికులేనంటూ జనాల్లోకి వెళ్తున్నారు. ప్రస్తుత ఎమ్మెల్యే రేఖానాయక్ సైతం జగిత్యాల జిల్లాకు చెందినవారు. ఈసారీ సీటుకోసం పోటీ పడుతున్న అభ్యర్థుల్లో కూడా స్థానికేతర నేతలు ఉన్నారు. ఇటీవల జోరుగా ప్రజల్లోకి వెళ్తున్న జాన్సన్ నాయక్‌ది కూడా జగిత్యాల జిల్లా మెట్‌పల్లి. ఉట్నూర్‌లో సెటిలైన ఆదిలాబాద్ జెడ్పీచైర్మన్ జనార్దన్ రాథోడ్‌ది ఆదిలాబాద్ జిల్లా నార్నూర్ మండలం. ఇది ఆసిఫాబాద్ నియోజకవర్గంలోకి వస్తుంది. కొన్ని దఫాలుగా ఖానాపూర్ నియోజకవర్గంలో చాలామంది ఇతర ప్రాంతాలకు చెందిన నేతలే ఎక్కువగా పోటీలో ఉంటున్నారు. ఇందుకు ఎస్టీ రిజర్వ్‌డ్ నియోజకవర్గం కావడం, నియోజకర్గాలు తక్కువగా ఉండటమే కారణంగా చెబుతున్నారు.

నేనంటే నేనే..

ఖానాపూర్ నియోజకవర్గంలో 'కారు' స్పీడ్‌గానే దూసుకుపోతోంది. తొలిసారి 2004 ఎన్నికల్లో అజ్మీరా గోవింద్‌నాయక్ టీఆర్ఎస్ అభ్యర్థిగా ఇక్కడి నుంచి గెలిచారు. రాష్ట్రం ఏర్పడిన తర్వాత 2014, 2018 ఎన్నికల్లో గులాబీపార్టీ నుంచి ప్రస్తుత ఎమ్మెల్యే రేఖానాయక్ గెలుపొందారు. ఈ నేపథ్యంలో ఇక్కడ బీఆర్ఎస్ గెలుపుపై అంచనాలు ఎక్కువగా ఉన్నాయి. అదే ఆశతో చాలామంది అభ్యర్థులు టికెట్ కోసం ప్రయత్నాలు ముమ్మరం చేస్తున్నారు. ప్రస్తుత ఎమ్మెల్యేతో పాటు మిగిలిన నలుగురు కూడా లంబాడ సామాజిక వర్గానికి చెందినవారే కావడం గమనార్హం.

- ప్రస్తుత ఎమ్మెల్యే రేఖానాయక్ రెండుసార్లు గెలిచిన తనకే మూడోసారి సీటు ఇస్తారని చెబుతున్నారు. సీఎం కూడా సిట్టింగ్‌లకే టికెట్ ఇస్తామని చెప్పిన విషయాన్ని గుర్తు చేస్తున్నారు.
- హైదరాబాద్ కలెక్టర్‌గా చేసిన శర్మన్ చౌహాన్ సైతం పార్టీ పెద్దలతో తనకున్న సంబంధాల మేరకు తనకే టికెట్ ఖాయమంటున్నారు. ఇప్పటికే నియోజకవర్గంలోని మా రుమూల గ్రామాల్లోకి సైతం వెళ్తూ నిత్యం ప్రజల్లో ఉండే ప్రయత్నం చేస్తున్నారు.
- రాజ్యసభ ఎంపీ సంతోష్‌రావు ప్రారంభించిన గ్రీన్‌ఇండియా చాలెంజ్ కన్వీనర్‌గా ఉన్న పూర్ణచందర్‌నాయక్ సైతం గ్రామగ్రామానికి వెళ్తున్నారు. ఎంపీ అండతో టికెట్ తనకే ఇస్తారన్న ప్రచారం ప్రజల్లో ఉంది.
- ఇటీవల నియోజకవర్గంలో విస్తృతంగా పర్యటిస్తున్న జాన్సన్‌నాయక్ ఎట్టి పరిస్థితుల్లో తానే అభ్యర్థినని చెబుతున్నారు. మంత్రి కేటీఆర్‌కు దగ్గరి మిత్రుడని, ఆయనకే టికెట్ వస్తుందని తన అనుచరులు చెబుతున్నారు.
- ఆదిలాబాద్ జెడ్పీచైర్మన్ జనార్దన్ రాథోడ్ సైతం తనకున్న సంబంధాల మేరకు టికెట్ తనకే ఇస్తారన్న నమ్మకాన్ని వెల్లడిస్తున్నారు.

సాంకేతిక పరిజ్ఞానం వినియోగించుకోవాలి


ఫోన్ అప్పగిస్తున్న సీఐ నారాయణనాయక్

ఖానాపూర్: ప్రతిఒక్కరూ సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకోవాలని సీఐ నారాయణనాయక్ అన్నారు. బీర్నంది గ్రామానికి చెందిన పద్మ, పట్టణానికి చెందిన రామకృష్ణ ఇటీవల పోగొట్టుకున్న ఫోన్లను సీఈఐఆర్ పోర్టల్ ద్వారా గుర్తించి ఆదివారం పట్టణంలోని సర్కిల్ కార్యాలయంలో అందజేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ పోగొట్టుకున్న సెల్‌ఫోన్లను సీఈఐఆర్ పోర్టల్ ద్వారా గుర్తించడం సులభమన్నారు. పోర్టల్‌పై ప్రజలకు అవగాహన కల్పిస్తామన్నారు.

హజ్ యాత్రికులు జాగ్రత్తలు పాటించాలి


శిబిరంలో పాల్గొన్న హజ్ యాత్రికులు

నిర్మల్‌టౌన్: హజ్ యాత్రికులు తగిన జాగ్రత్తలు పాటించాలని ఖాదిముల్ హుజ్జాజ్ హజ్ సొసైటీ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు షేక్ హయాత్, అబ్దుల్ రహమాన్, అజీజ్ సూచించారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని సోఫీనగర్ ఎస్ఆర్ ఫంక్షన్ హాల్‌లో శిక్షణ శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ ఏడాది తెలంగాణ రాష్ట్రం నుంచి 5,200 మంది హజ్ యాత్రకు వెళ్తున్నారని, ఇందులో నిర్మల్ జిల్లా నుంచి 138 మంది ఉన్నారన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర హజ్ కమిటీ సభ్యుడు మహమ్మద్ నజీరుద్దీన్, అబ్దుల్ మతిన్, ఇంతియాజ్, ఫెరోజ్‌ఖాన్, ఇజాజ్, తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి



సాయిరాం మృతదేహం

భైంసా: బాసర సరస్వతీ ఆలయంలో ఎన్ఎంఆర్‌గా విధులు నిర్వహించే సాయిరాం(42) ఆదివారం రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన సంఘటన మహారాష్ట్ర, తెలంగాణ సరిహద్దులో చోటుచేసుకుంది. సాయిరాం మరో వ్యక్తితో కలిసి మహారాష్ట్రలోని ధర్మాబాద్‌కు వెళ్లాడు. తిరుగు ప్రయాణంలో వీరి బైక్ అదుపుతప్పి పడిపోవడంతో సాయిరాం రోడ్డు పక్కన తవ్విన కాల్వలో పడి మృతిచెందాడు. మరో వ్యక్తి గాయాలు కాగా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. మహారాష్ట్ర పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ప్రశాంతంగా ఏకలవ్య గురుకుల అడ్మిషన్ టెస్ట్



పర్యవేక్షిస్తున్న ఆర్సీవో గంగాధర్

ఉట్నూర్‌రూరల్: తెలంగాణ ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలలో 2023–24 విద్యా సంవత్సరానికి 6,7,8,9వ తరగతుల్లో ప్రవేశాల కోసం ఉట్నూర్ మండలం లాల్‌టేకిడిలోని గిరిజన సంక్షేమ గురుకుల బాలుర పాఠశాల, కళాశాలలో ఆదివారం అడ్మిషన్ టెస్ట్ నిర్వహించినట్లు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఆర్సీవో గంగాధర్ పేర్కొన్నారు. మొత్తం 823 మంది విద్యార్థులకు 790 మంది హాజరైనట్లు తెలిపారు. 7,8,9వ తరగతుల్లో మిగిలిన సీట్లకు మధ్యాహ్నం పరీక్ష నిర్వహించారు.

భీమల్‌పేన్ మందిరం కోసం పీవోకు వినతి



వినతి పత్రం అందిస్తున్న ఆదివాసీ సంఘాల నాయకులు

ఉట్నూర్‌రూరల్: భీమల్‌పేన్ మందిర నిర్మాణం కోసం ఆదివారం ఆదివాసీ సంఘాల నాయకులు ఇన్‌చార్జీ ఐటీడీఏ పీఓ వరుణ్ రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంఘాల నాయకులు మాట్లాడుతూ.. ఉమ్మడి జిల్లాలో పెర్సపేన్ భీమాల్‌పేన్ మందిరానికి రూ.10 లక్షలు విరాళం ఇస్తామని గతంలోని పీవో హామీ ఇచ్చారని, ఇంత వరకు ఆ దిశగా చర్యలు తీసుకోవడం లేదని అన్నారు. మంత్రి ఐకే రెడ్డి కూడా విరాళం ఇస్తామని చెప్పారని, ఇంత వరకు తమకు న్యాయం జరగడం లేదన్నారు. ఆదివాసీ సంఘా ల నాయకులు కాశిరాం, తుకారాం, సోనేరావు, భీంరావు, సురేశ్, బారిక్‌రావు పాల్గొన్నారు.



మంచిర్యాల రెడ్‌క్రాస్ బ్లడ్‌బ్యాంకులో రక్తం ఎక్కించుకుంటున్న తలసేమియా బాధితులు (ఫైల్)

తలసేమియా చంపేస్తోంది...!

- ఉమ్మడి జిల్లాలో 4వేలకు పైగా బాధితులు
- దివ్యాంగులుగా గుర్తించినా.. అందని ఫలాలు
- రక్తం ఎక్కించకపోతే ప్రాణాలకే ముప్పు
- నేడు ప్రపంచ తలసేమియా దినోత్సవం

మంచిర్యాలటౌన్: తలసేమియా... ఓ ప్రాణాంతక వ్యాధి. అధికారుల లెక్కల ప్రకారం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 4వేలకు పైగా తలసేమియా బాధితులు ఉన్నారు. వాస్తవానికి వీరి సంఖ్య మరింత ఎక్కువగా ఉండే అవకాశం ఉంది. వైద్య పరీక్షలు చేస్తేగానీ ఈ వ్యాధి ఉన్నట్లుగా గుర్తించలేక పోతున్నారు. దీంతో ఎంత మంది ఈ వ్యాధి బారిన పడుతున్నారనే దానిపై పూర్తిస్థాయిలో లెక్కలు లేవు. తలసేమియా వ్యాధికి గురైన బాధితులు ప్రతీ పక్షం రోజులకోసారి రక్తం ఎక్కించుకోవాల్సి ఉంటుంది. ఉమ్మడి జిల్లాలో మంచిర్యాల జిల్లా ఆసుపత్రి, ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని రిమ్స్‌లో ఉచితంగా రక్తం ఎక్కిస్తున్నారు. ఇలాంటి వ్యాధి బారినపడే వారిని కాపాడేందుకు వారికి ముఖ్యంగా కావాల్సింది రక్తమే. నేడు ప్రపంచ తలసేమియా దినోత్సవం సందర్భంగా 'సాక్షి' ప్రత్యేక కథనం...

తలసేమియా వ్యాధి లక్షణాలు... జాగ్రత్తలు

తలసేమియా.. వంశపారపర్యంగా తల్లిదండ్రుల నుంచి పిల్లలకు వస్తుంది. మైనర్, ఇంటర్మీడియెట్, మేజర్ మూడు దశల్లో ఉంటుంది. తలసేమియా అల్ఫా, బీటా రెండు రకాలు. ఒక ఆల్ఫా చెంజ్ కానీ, ఒక బీటా చెంజ్ తగ్గినప్పుడు మైనర్ వ్యాధి ఉన్నట్లు. వీళ్ల వ్యాధిగ్రస్తులైనప్పటికీ రక్త మార్పిడి అవసరం లేదు. వీరు వ్యాధి తీవ్రతతో బాధపడరు. కానీ వారి నుంచి వారి పిల్లలకు వ్యాధి సంక్రమిస్తుంది. ఇంటర్మీడియెట్, మేజర్స్‌లో హిమోగ్లోబిన్ (హెచ్‌బీ) తగ్గుతుంది. వారికి రక్తం ఎక్కించాల్సి ఉంటుంది. రోగి శరీరంలో ఒక యూనిట్ రక్తం ఎక్కిస్తే ఒక గ్రాము హెచ్‌బీ పెరుగుతుంది. హిమోగ్లోబిన్ మెయింటనెన్స్ కనీసం 10.5 గ్రాములు శాతం ఉండేటట్లు చూసుకోవాలి. ప్రతి 15 రోజులకోసారి వీరికి రక్తం అవసరం. జ్వరం రావడం, ఆకలి తగ్గడం, కామెర్లు, మూత్రం పసుపు రంగులో రావడం, ఇన్‌ఫెక్షన్ జరగడం, మనిషి ఎదుగుదల నిలిచిపోతుంది.

మంచిర్యాల బ్లడ్‌బ్యాంక్‌లో సేవలు...

ఉమ్మడి జిల్లాలోనే తలసేమియా వ్యాధిగ్రస్తులకు వైద్య పరీక్షలను చేసేందుకు అవసరమైన అన్ని పరికరాలు మంచిర్యాల జిల్లా ఆసుపత్రిలోని రెడ్ క్రాస్ బ్లడ్‌బ్యాంకులో లభిస్తున్నాయి. తలసేమియా వ్యాధి నిర్ధారణకు అవసరమైన హెచ్‌బీ ఏ2 పరీక్ష చేసే హెచ్‌పీసీఎల్ మిషన్ డ్క్రాస్ సొసైటీ బ్లడ్‌బ్యాంకులో అందుబాటులో ఉంచారు. సీరం అబార్డ్ ఐ 1000 ఎస్ఆర్ మిషన్‌ను మంచిర్యాల రెడ్‌క్రాస్ సొసైటీలో సింగరేణి సహకారంతో ఏర్పాటు చేయగా తలసేమియా బాధితులకు ఎంతగానో ఉపయోగపడుతోంది.

ఆరోగ్యశ్రీ సేవలు...

తలసేమియా వ్యాధిన పడిన వారికి ప్రతి నెలా మందులకు అయ్యే ఖర్చులను అందజేస్తే రోగికి భరోసాగా ఉంటుందని ఆరోగ్యశ్రీలో దీనిని చేర్చారు. రక్తంలో ఐరన్ పెరిగితే ఐరన్ చిలేషన్ థెరపీ మందులు ఒక్కొక్కరికి రూ.5 నుంచి 10వేల వరకు ప్రతి నెలా వాడాల్సి ఉంటుంది. ఉమ్మడి జిల్లాలో ఎక్కడా ప్రభుత్వం తరుపున ఉచితంగా మందులు అందకపోవడంతో నాటి కలెక్టర్ కర్ణన్ ప్రత్యేక చొరవ తీసుకుని బాధితులకు ఆరోగ్యశ్రీ ద్వారానే అన్ని రకాల మందులు, వైద్య సేవలను అందించేలా మంచిర్యాల బ్లడ్ బ్యాంక్‌లో ఆరోగ్యశ్రీ కోసం ఒక గదిని ఏర్పాటు చేశారు. మంచిర్యాల బ్లడ్‌బ్యాంకులో 190 మంది తలసేమియా, 577 మంది సికిల్‌సెల్ వ్యాధిగ్రస్తులుండగా, 83మంది ఆరోగ్యశ్రీ ద్వారా సేవలను పొందుతున్నారు. మిగిలిన వారికి బ్లడ్‌ను ఉచితంగా ఎక్కిస్తున్నారు.

దివ్యాంగులుగా గుర్తించాలి...



తలసేమియా సికిల్ సెల్ వ్యాధిగ్రస్తులను కేంద్రం 2016లో దివ్యాంగులుగా గుర్తించినా రాష్ట్ర ప్రభుత్వం జీవోను అమలు చేసేందుకు 13జూన్ 2018 లోనే దివ్యాంగులుగా గుర్తించారు. తలసేమియా, సికిల్‌సెల్ వ్యాధితో బాధపడుతున్న వారికి పింఛన్ అందడం లేదు. గర్భిణులకు ముందుగానే తలసేమియా, సికిల్‌సెల్‌కు సంబంధించిన వైద్య పరీక్షలను జిల్లాలో చేయాలి. వ్యాధి నివారణకు బోన్ మ్యారో ట్రాన్స్‌ప్లాంటేషన్‌ను ప్రభుత్వం ఉచితంగా చేయాలి. ఆరోగ్యశ్రీలో, వైట్ రేషన్‌కార్డుల్లో పేర్లు లేని వారికి సీఎంసీవో కార్డులను 20రోజుల వ్యాలిడిటీతో ఆదిలాబాద్‌లో ఇస్తున్నారు. మంచిర్యాలలోనూ ఈ కార్డులు ఇచ్చి వ్యాలిడిటీని ఆరు నెలలకు పొడిగించాలి.

– కాసర్ల రంజిత్, తలసేమియా వెల్ఫేర్ సొసైటీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి

యువకుడి అదృశ్యం

ఆదిలాబాద్‌టౌన్: ఆదిలాబాద్ పట్టణంలోని ఖైజవాన్ నగర్‌కు చెందిన మోయిన్ రజా అనే యువకుడు అదృశ్యమయ్యాడు. కిడ్నీలో రాళ్లు ఉండడంతో కొంత కాలంగా అనారోగ్యంతో ఇంటికే పరిమితమయ్యాడు. శనివారం ఆరోగ్యం కొంత మెరుగుపడడంతో ఉదయం 9గంటల ప్రాంతంలో స్కూటీపై ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. ఆదివారం వరకు కూడా ఇంటికి రాకపోవడంతో తండ్రి షేక్ అబ్దుల్ ఖయ్యూం రజా టూటౌన్‌లో ఫిర్యాదు చేయగా కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై విష్ణుప్రకాష్ తెలిపారు.

పదిమందిపై కేసు

సారంగాపూర్: మండలం ఆదివారం నిర్వహించిన డ్రంకెన్‌డ్రైవ్‌లో పది మందిపై కేసులు నమోదు చేసినట్లు ఎస్సై కృష్ణసాగర్‌రెడ్డి తెలిపారు. మద్యం సేవించి వాహనాలు నడిపే వ్యక్తులు ఎవరైనా కేసులు నమోదు చేస్తామని తెలిపారు.

15మందిపై కేసు నమోదు

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని మంచిర్యాల్ ఎక్స్ రోడ్ వద్ద ఆదివారం పోలీసులు వాహనాల తనిఖీ నిర్వహించారు. 15మంది మద్యం తాగి పట్టుబడగా వారిపై కేసు నమోదు చేసినట్లు పట్టణ ట్రాఫిక్ ఎస్సై రాజశేఖర్ తెలిపారు. మద్యం తాగి వాహనాలు నడిపి ప్రమాదాలకు కారణం కావద్దని సూచించారు. ఇందులో ట్రాఫిక్ ఎస్సై దేవేందర్ ఉన్నారు.

పిడుగుపాటుకు వ్యక్తి మృతి



మధుకర్ మృతదేహం

బోథ్: మండలంలోని కిష్టాపూర్ శివారులో ఆదివారం పిడుగుపడి మధుకర్(51) మృతి చెందాడు. మండల కేంద్రానికి చెందిన తిరుపతి రెడ్డి అనే రైతు దగ్గర పాలేరుగా పనిచేస్తున్న మధుకర్ ఆదివారం చేనులో మొక్కజొన్న పంట కోత కోసే సమయంలో ఒక్కసారిగా వర్షం కురిసింది. దీంతో చేనులోని ఓ చెట్టు కిందకి వెళ్లాడు. పిడుగుపాటుతో కిందపడిపోయాడు. గమనించిన స్థానికులు అతడిని ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు.

'నీట్'గా జరగని పరీక్ష

- ఆలస్యంగా చేరుకోవడంతో ఓ అభ్యర్థి పరీక్షకు దూరం
- 24 మంది గైర్హాజరు
- కేంద్రాల్లో కరువైన సౌకర్యాలు



నంబర్లు చూసుకుంటున్న అభ్యర్థులు



పరీక్ష కేంద్రంలోనికి పంపిస్తున్న సిబ్బంది

ఆదిలాబాద్‌టౌన్: ఎంబీబీఎస్ ప్రవేశం కోసం నిర్వహించిన నీట్ పరీక్షలో అభ్యర్థులు అవస్థలు పడ్డారు. పరీక్ష నిబంధనలు అభ్యర్థులకు తెలియకపోవడంతో సతమతమయ్యారు. దూర ప్రాంతాల నుంచి జిల్లా కేంద్రానికి వచ్చిన అభ్యర్థులకు ఇబ్బందులు తప్పలేదు. ఆదిలాబాద్ పట్టణానికి పది కిలో మీటర్ల దూరంలో భీంసరి సమీపంలోని మల్లాపూర్‌లో ఓ పరీక్ష కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఒకే పాఠశాల పేరిట రెండు పరీక్ష కేంద్రాలు ఉండడంతో అభ్యర్థులు తికమక పడ్డారు. ఈ పరీక్షకు ఉదయం 11 గంటల నుంచే వరుసలో నిలబెట్టి తనిఖీలు చేయడంతో ఎండలో తీవ్ర అవస్థలు పడ్డారు. పరీక్ష మధ్యాహ్నం 2 గంటలకు గాకా మూడు గంటలు ముందుగానే లోనికి పంపించారు. పరీక్ష కేంద్రంలో సరైన సౌకర్యాలు కల్పించకపోవడంతో నానా తంటాలు పడ్డారు. అయితే పరీక్షకు సంబంధించి ప్రైవేటు పాఠశాలల నిర్వాహకులకు బాధ్యతలు అప్పజెప్పడంతో ఈ విధంగా జరిగినట్లు తెలుస్తోంది. జిల్లా కేంద్రంలో వందలాది పాఠశాలలు ఉండగా, ఊరి బయట కేంద్రం ఏర్పాటు చేయడంపై అభ్యర్థులు మండిపడ్డారు. సరైన సమయంలో కేంద్రానికి చేరుకోకపోవడంతో ఓ అభ్యర్థి పరీక్షకు దూరమయ్యాడు. నిర్మల్ నుంచి బస్సులో వచ్చిన అభ్యర్థి అంజు నాగుల ఆటో ద్వారా ఆ పరీక్ష కేంద్రానికి 1.45 గంటలకు చేరుకున్నాడు. 1.30 గంటల వరకే పరీక్ష కేంద్రంలోనికి అనుమతించడంతో నిర్వాహకులకు బతిమిలాడినా కనికరించలేదు. దీంతో పరీక్ష రాయకుండానే కన్నీరుమున్నీరవుతూ వెనుదిరిగాడు. దూర ప్రాంతాల నుంచి వచ్చిన వారు బ్యాగులు తీసుకురాగా వాటి కోసం కౌంటర్ ఏ ర్పాటు చేయలేదు. దీంతో అభ్యర్థులు పరేషాన్ అయ్యారు.

24 మంది గైర్హాజరు..

నీట్ పరీక్షకు ఆదిలాబాద్ పట్టణంలోని మూడు పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఈ పరీక్షకు మొత్తం 1467 మందికి 1443 మంది హాజరు కాగా 24 మంది గైర్హాజరయ్యారు. ఆర్యభట్ట ఇంటర్నేషనల్ పాఠశాలలో 432 మందికి గాను 426 మంది హాజరు కాగా ఆరుగురు గైర్హాజరయ్యారు. చవరా పాఠశాలలో 504 మందికి 495 మంది హాజరు కాగా, ఆరుగురు గైర్హాజరయ్యారు. ఆర్యభట్ట హైస్కూల్‌లో 531 మందికి 9మంది గైర్హాజరయ్యారు. 522 మంది హాజరైనట్లు పరీక్షల సిటి కోఆర్డినేటర్ శిశిర్ తెలిపారు.

విద్యుత్ షాక్‌తో జీపీ కార్మికుడి మృతి



బాలేరావు రాము (ఫైల్)



రోదిస్తున్న కుటుంబీకులు

తానూరు: జీపీ కార్యాలయంలో విద్యుత్ సరఫరా చేసేందుకు విద్యుత్ స్తంభం ఎక్కి జీపీ కార్మికుడు షాక్‌తో మృతి చెందిన సంఘటన మండలంలోని బోరిగాం గ్రామంలో చోటుచేసుకుంది. కుటుంబ సభ్యుల వివరాల ప్రకారం... బోరిగాం జీపీలో బాలేరావ్ రాము(50) ఏడేళ్లుగా జీపీ కార్మికుడిగా సేవలు అందిస్తున్నాడు. ఆదివారం బోరిగాం గ్రామంలో బజార్‌లైన్‌కు ఉన్న రెండు స్తంభాలకు విద్యుత్ బల్బులు రాకపోవడంతో గ్రామంలోని మినీ ట్రాన్స్‌ఫార్మర్ ఆఫ్ చేసి విద్యుత్ బల్బులు అమర్చాడు. జీపీ కార్యాలయంలో విద్యుత్ సరఫరా లేక విద్యుత్ తీగను పెట్టేందుకు విద్యుత్ స్తంభం ఎక్కుతుండగా అక్కడే ఉన్న మినీ ట్రాన్స్‌ఫార్మర్‌కు సరఫరా చేసే 11 కేవీ విద్యుత్ తీగ తగలి కిందపడి మృతిచెందాడు. మృతుడికి భార్య జనాబాయి, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. ఎస్సై విక్రమ్ సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

యువకుడిపై హత్యాయత్నం

- మద్యం మత్తులో యువకుడిపై కత్తితో దాడి



గాయపడిన వికాస్

ఆదిలాబాద్‌రూరల్: మద్యం మత్తులో ఓ యువకుడిపై విచక్షణ రహితంగా కత్తితో దాడి చేసినా సంఘటన ఆదిలాబాద్ జిల్లాలో కలకలం రేపింది. ఈ దాడి పాత కక్షలే కారణమని తెలుస్తుంది. ఆదిలాబాద్ రూరల్ ఎస్సై నాగనాథ్ కథనం ప్రకారం.. ఆదిలాబాద్ పట్టణంలోని మహాలక్ష్మీవాడకు చెందిన కౌన్సిలర్ సందా నర్సింగ్ కుమారుడి వివాహ వేడుకల నేపథ్యంలో ఆదివారం పట్టణ శివారు ప్రాంతంలోని ఓ గార్డెన్‌లో జరుగనుంది. అందులో భాగంగానే ఆ కాలనీకి చెందిన పలువురు శనివారం రాత్రి ఏర్పాట్ల కోసం వెళ్లారు. ఏర్పాట్లు పూర్తయిన అనంతరం గార్డెన్‌కు సమీపంలో రెండు గ్రూపులు వేర్వేరుగా మద్యం సేవించారు. ఇందులో వికాస్, అక్షయ్, విశాల్, అఖిల్‌లు ఓ చోట కూర్చొని మద్యం సేవించారు. మరో గ్రూపునకు చెందిన కార్తీక్, గజు, ఉదయ్ అదే ప్రాంతంలో కొంత దూరంలో మద్యం సేవించారు. మొదటి గ్రూపులోని ఇద్దరు వ్యక్తులు విశాల్, అఖిల్‌లు వాహనం తీసుకువచ్చేందుకు వెళ్లగా వికాస్, అక్షయ్ ఇద్దరు కార్తీక్, గజు, ఉదయ్‌లు మద్యం సేవిస్తున్న చోటికి వెళ్లారు. దీంతో వికాస్‌కు కార్తీక్ మధ్య గొడవ మొదలైంది. దీంతో వికాస్‌పై కార్తీక్ కత్తితో దాడి చేయగా తీవ్ర గాయాలయ్యాయి. గాయపడిన వికాస్‌ను స్థానికులు చికిత్స కోసం జిల్లా కేంద్రంలోని రిమ్స్ ఆసుపత్రికి తరలించారు. వికాస్ తండ్రి ఆకుల విఠల్ ఇచ్చినా ఫిర్యాదు మేరకు కార్తీక్, గజులపై కేసు నమోదు చేసుకోని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

మంద నిలబెడదాం.. భూసారం పెంచుదాం



పొలంలో మంద కట్టిన గొర్రెలు, మేకలు



నాగరాజు, ఏవో

నిర్మల్‌చైన్‌గేట్: వర్షాకాలం, యాసంగిలో సాగు చేసిన పంటలు రైతుల చేతికి అందాయి. పంట సాగు చేసిన పొలాలు ప్రస్తుతం ఖాళీగా ఉన్నాయి. పొలాల్లో భూసారం పెంచుకోవడానికి గొర్రెల, మేకల మందను కట్టించాలని ఏడీఏ సక్రియ నాయక్ రైతులకు సూచిస్తున్నారు. జీవాల మల మూత్రాలు సేంద్రియ ఎరువులుగా మారి పంటభూములకు అవసరమైన పోషకాలను అందిస్తాయని ఏవో వివరించారు. పొలాల్లో గొర్రెల, మేకల మందలు కట్టించడం వలన వచ్చే సీజన్లో వేసే పంటలకు మేలు కలుగుతుంది. సేంద్రియ ఎరువుల వినియోగంపై రైతుల్లో అవగాహన పెంపొందించుకోవడానికి అవకాశం ఉంటుందని తెలిపారు. విచక్షిణ రహితంగా ఎరువులు, పురుగు మందులు వినియోగించడం వలన తెగుళ్ల ఉధతి పెరగడంతో పాటు సాగు వ్యయం ఖర్చు సైతం పెరుగుతుందని పేర్కొన్నారు. దీన్ని తగ్గించుకోవడానికి యాసంగి సీజన్‌లో పొలాలు ఖాళీ అవుతుండడంతో మంద కట్టడంపై రైతులు ఆసక్తి కనబర్చాలని సూచించారు. ప్రస్తుతం అవకాశం ఉన్న రైతులు తమ పొలాలు ఖాళీ అవుతుండటంతో గొర్రెలు, మేకలతో మంద కట్టించుకోవాలన్నారు.

ఇలా చేసుకోవాలి...

గొర్రెలు, మేకల దొడ్లలలో పశువుల ఎరువుల మాదిరిగా నిలువచేసి పొలానికి వాడుకోవచ్చు. యాసంగిలో మినుము తీత వరికోత పూర్తవ్వగానే ఆయా పంట పొలాల్లో జీవాల మంద కట్టిస్తున్నారు. మంద కట్టిస్తే జీవాలు మల మూత్రాలను విసర్జిస్తాయి. అవి సేంద్రియ ఎరువుగా భూమికి అవసరమైన పోషకాలను అందిస్తాయి. మంద కట్టిన తర్వాత ఒకసారి పొలాన్ని దుక్కిదున్నిస్తే ఎరువు నేలలో కలి సిపోయి పోషకాలు వధా కాకుండా ఉంటాయి.

మంద కట్టడం ద్వారా జీవనం..

పంట పొలాల్లో మేకలు, గొర్రెలను మంద కట్టించడం ద్వారా పెంపకందార్లు జీవనం సాగిస్తారు. ఎకరం పొలంలో సుమారు వెయ్యి వరకు జీవాలను మందకట్టిస్తారు. ఇందుకుగాను రైతులు ఒక్కొక్కరు రూ.300 నుంచి రూ.500 వరకు పెంపకందార్లకు ఇస్తారు. ఇలా వచ్చిన సొమ్ముతోపాటు జీవాల పిల్లలను అమ్మకం ద్వారా పెంపకందార్లు జీవనం గడుపుతుంటారు.

వలస వచ్చి జీవనం

నిర్మల్ జిల్లాలోని పలు ప్రాంతాలకు జీవాల పెంపకందార్లు వలస వస్తుంటారు. జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి జీవాలు ఇక్కడికి వస్తాయి. ఈ ఏడాది దాదాపు 40వేల జీవాలు వలస వచ్చాయి. రెండు నెలల క్రితమే జీవాల పెంపకందార్లు వచ్చారు. ఖాళీ భూముల్లో జీవాలను మేపుతూ నెలల తరబడి జీవనం గడుపుతుంటారు. మంద కట్టించడం ద్వారా పొలాలకు పోషకాలను అందించడంతోపాటు పెంపకందార్లను ఆదరించినట్లు అవుతుంది.

పెర్సాపేన్ బేటింగ్‌లో కొత్త కోడళ్లు



బేటింగ్‌లో పాల్గొన్న పెందూర్ వంశ కోడళ్లు

గుడిహత్నూర్: మండలంలోని భీంపూర్ గ్రామంలో ఆదివారం పెర్సాపేన్ ఉత్సవంలో భాగంగా పెందూర్ వంశస్తుల కొత్త కోడళ్లు బేటింగ్ అయ్యారు. అనంతరం పెర్సాపేన్‌ను దర్శించుకుని పూజలు నిర్వహించారు. అనంతరం పెందూర్ వంశం పెద్దలు సంప్రదాయం ప్రకారం పూజలు నిర్వహించారు.

25 ఏళ్లకు కలుసుకున్నారు..



పొన్కల్ పాఠశాలలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం

మామడ: 25ఏళ్ల క్రితం ఆ పాఠశాలలో పదో తరగతి పూర్తి చేసుకుని వివిధ ప్రాంతాలకు వెళ్లి స్థిరపడి మళ్లీ ఆదివారం పాఠశాలలో పూర్వ విద్యార్థుల సమ్మేళనంలో కలుసుకున్నారు. మండలంలోని పొన్కల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1998–99 ఎస్ఎస్‌సీ బ్యాచ్ పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. చాలాకాలం తర్వాత కలుసుకోవడంతో ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకున్నారు. యోగక్షేమాలు తెలుసుకుని విద్యనందించిన గురువులు హన్మంత్‌రావ్, వెంకటేశ్వర్‌రావ్, వెంకన్నలను శాలువ మెమెంటోలతో సన్మానించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు శేఖర్, ముత్యంరెడ్డి, సాగర్, పవన్‌కుమార్, సంతోష్‌రెడ్డి, గోపి, స్వప్న, సుధాకర్, భోజన్న, షాహిద్, కిషోర్ పాల్గొన్నారు.